క్లుప్తంగా

కంప్యూటర్ బహూకరణ

అల్లవరం: మండలం విద్యావనరుల కేంద్రానికి కొమరగిరిపట్టణానికి చెందిన మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కంప్యూటర్‌ను బహూకరించారు. ఎమ్ఈవోలు కె.కిరణ్ బాబు, ఎస్.ఏడుకొండలుకు ట్రస్ట్ అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షుడు కుసుమ రమేష్ బాబు చేతుల మీదుగా సోమవారం వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ అల్లవరం మండలం అధ్యక్షుడు గురు నాయుడు, ప్రధాన కార్యదర్శి, కె.రత్నరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీతోట బాలకృష్ణ, అభయ్ కన్వీనర్ కేవీవీఎస్ శివకుమార్, రుద్రరాజు రమేష్ రాజు, మోసుగంటి విజయకుమారి, మోసుగంటి లక్ష్మీ ప్రసన్న, ఎమ్ఐఎస్ కో ఆర్డినేటర్ ప్రసాద్, యలమంచిలి రమేష్ పాల్గొన్నారు.

ఎమ్‌కేఆర్ ట్రోఫీ విజేత యానాం వైపర్స్



విజేతగా నిలిచిన యానాం వైపర్స్ దరియాలతిప్ప జట్టు

యానాం: ఎమ్‌కేఆర్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్-2025 విజేతగా యానాం వైపర్స్ దరియాలతిప్ప జట్టు నిలిచింది. సోమవారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఫైనల్స్‌లో యానాం స్మాషర్స్ జట్టును యానాం వైపర్స్ దరియాలతిప్ప జట్టు ఓడించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రాజేష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అరవింద్ బెస్ట్‌బౌలర్‌గా ఎం వీరబాబు ఎంపికయ్యారు. వారం రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో 18 జట్లు తలపడ్డాయి. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు, తృతీయ స్థానం జట్టుకు రూ.10వేలు నగదు బహుమతులు అందించారు.

బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కిషోర్


చీకట్ల కిషోర్

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా అమలాపురం నియోజకరవర్గంలోని ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన చీకట్ల కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయని ఆయన తెలిపారు. కిషోర్ గతంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా, 2024 ఎన్నికలకు పెద్దాపురం నియోజకవర్గం అబ్జర్వర్‌గా పనిచేశారు. ఈ నియామకానికి కృషి చేసిన జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, పినిపే శ్రీకాంత్‌కు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం సొమ్ము చెల్లించాలి

ఉప్పలగుప్తం: రబీ ధాన్యం సొమ్ము నేటికీ జమ కాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గొల్లవిల్లిలో కోనసీమ రైతు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం ఆధ్వర్యంలో రైతులంతా సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీలో పండించిన ధాన్యానికి సొమ్ము విడుదల కాలేదని అన్నారు. గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు చేసిన ప్రకారం ప్రతి రైతు దగ్గర ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మంగెన వెంకటనరసింహారావు, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీవీసీ విద్యార్థుల ప్రతిభ


అమలాపురంరూరల్: భట్లపాలెం బోనం వెంకట చలమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఏఐఎంఎల్ శాఖ విద్యార్థులు ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థులు వీ మణిశ్రీ, కె.లీల, ఏ.పల్లవి, సి.స్వర్ణ రూపొందించిన 'ఫ్రెష్ వాటర్ ప్యూరిఫైయర్' ప్రాజెక్ట్ మలేషియాలో నిర్వహిస్తున్న ఐఈఈఈ ఏసీస్- 2025 ఇన్నోవేషన్ చాలెంజ్ ఫైనల్ రౌండ్‌కు ఎంపికైంది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ నీటి సంక్షేమం, స్థిరమైన ఉపయోగంపై కేంద్రీకృతమై ఉంది. ఫైనల్ రౌండ్ ఆగస్ట్ 23, 24 తేదీల్లో మలేషియాలోని ఐఈఈఈ యూకేఎం స్టూడెంట్ బ్రాంచ్ వద్ద నిర్వహిస్తారని బీవీసీ కళాశాలల అధినేత బోనం కనకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేఈవీవీ రామరావు, ఏవో జక్కం కృష్ణారావు, పైలట్ అధినేత శర్మ, కోఆర్డినేటర్ డీవీ సతీష్, మెంటార్లు వంశీ రామ్, భవాని, అంబాసిడర్ విజయ్ సూర్య ఈ విజయాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

అమలాపురం టౌన్: మితిమీరిన వేగంతో ఓ కారు మోటార్‌సైక్లిస్టును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటారు సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని 216 జాతీయ రహదారిపై ఏఎస్‌ఏ ఆస్పత్రి సమీపంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఢీకొట్టిన అనంతరం కనీస మానవత్వం లేకుండా ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుడిని రోడ్డుపైనే వదిలేసి కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ మోటారు సైకిలిస్టును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వారితో పాటు కారు ఆచూకీ కోసం గాలిస్తున్నామని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

అరకొర సేవలు.. ప్రజల అసంతృప్తి

- మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె పర్యవసానం
- వీధి దీపాలు వెలగక అమలాపురంలో పలు వీధుల్లో అధకారం
- పలు వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం
- ప్రత్యామ్నాయ సిబ్బందితో అంతంతమాత్రంగా సేవలు


లైట్లు వెలగక అంధకారం అలుముకున్న అమలాపురంలోని కురసాలవారి వీధి


ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెతో కుళాయిల నుంచి తాగునీరు రాక వేరే ప్రాంతం నుంచి టిన్నుతో నీరు తెచ్చుకుంటున్న దృశ్యం

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు వీధులు తాగునీటి సరఫరా సక్రమంగా లేక, వీధి దీపాలు వెలగక ఆయా వీధుల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మున్సిపాలిటీ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన 50 మంది అవుట్ సోర్సింగ్ వర్కర్లు కొన్ని రోజులుగా సమ్మె బాట పట్టడం, ఆదివారం నుంచి విధులు పూర్తిగా బహిష్కరించి సమ్మెను ఉధృతం చేయడంతో వారు రోజూ నిర్వర్తించే తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ కుంటుపడింది.

50 మంది ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె బాట

ఇంజినీరింగ్ వర్కర్స్ విధుల్లో లేకపోవడం వల్ల పట్టణంలోని వడ్డిగూడెం, ఆశానగర్, సావరం, చింతగుంట చెరువు, ఏవీ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. చిక్కాల వీధి, కురసాలవారి వీధి, రవణం మల్లయ్య వీధి, రవణం వీధి, శ్రీరామపురం సెంటరు, విత్తనాల వారి కాలువ గట్టు తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక అంధకారం అలుముకుంది. రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఆదివారం నుంచి అమలాపురం వర్కర్స్ యూనియన్ సమ్మెను ఉధృతం చేసింది. ఈ యూనియన్‌కు చెందిన 50 మంది తాగునీటి విభాగం, వీధి దీపాల నిర్వహణ, మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల్లో పనిచేసే వారు. ఇప్పుడు వారు తమ డిమాండ్ల సాధన కోసం విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయంగా 20 మందిలోపు సిబ్బందితో సేవలు

తాగునీరు సక్రమంగా అందక కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు సమీప ప్రాంతాల నుంచి కుళాయిల ద్వారా టిన్‌లలో పట్టుకుని వెళ్లడం సోమవారం కనిపించింది. మున్సిపాలిటీ ఈ 50 మంది ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెలో ఉండడంతో వారు రోజూ నిర్వర్తించే విధులను వేరే ఉద్యోగులకు కేటాయించారు. వార్డు సచివాలయాల ఇంజినీరింగ్ కార్యదర్శులు, కేవలం ఆరుగురే ఉన్న ఇంజినీరింగ్ వర్కర్లతో ప్రత్యామ్నాయంగా పనిచేయిస్తున్నారు. అయితే 50 మంది వర్కర్ల పని కేవలం 20 మందిలోపు సిబ్బందితో ప్రత్యామ్నాయంగా, తాత్కాలికంగా నియమించి వారితో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పనులు చేయిస్తున్నారు. వీరి సేవలు అంతంత మాత్రంగా ఉండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవలకు ఎటువంటి ఆటంకం లేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నా వాస్తవంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె చేపట్టినప్పటికీ వారు చేసే విధులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. వారు సమ్మెలో ఉండడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేదు. వార్డు సచివాలయాల సిబ్బంది, పర్మినెంట్ వర్కర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం వల్ల పనులు సజావుగా సాగుతున్నాయి. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపరంగా ప్రజలు అసౌకర్యానికి గురి కావడం లేదు.

– సీహెచ్.నాగ సతీష్, డీఈఈ, అమలాపురం మున్సిపాలిటీ

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ


అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మజ్జిగ ప్యాకెట్లు, బ్రెడ్‌లు అందజేస్తున్న ఆర్యవైశ్య సీనియన్ సిటిజన్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 33 రోజులుగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం వద్ద రోజుకు 300 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. సోమవారం వారు స్థానిక కలెక్టరేట్ వద్ద, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 700 మజ్జిగ ప్యాకెట్లు పంచారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఇచ్చిన విరాళాలతో మజ్జిగ చలివేంద్రాన్ని ఈ వేసవి కాలంలో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులకు, వివిధ శాఖల అధికారులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేసి దాహార్తిని తీర్చారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు మజ్జిగ ప్యాకెట్లతోపాటు బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి నూలు సూర్య ప్రభాకరరావు, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీఘాగోళపు రాంపండు, నంబూరి శ్రీనివాస్, కొల్లూరి మధు, పచ్చిగోళ్ల స్వామి ప్రసాద్, తటవర్తి రత్నాజీ, అప్పన పద్మనాభం తదితరులు సేవలు అందించారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయనందుకు నిరసనగా పార్టీ అధినేత జగన్ పిలుపు మేరకు 4వ తేదీ బుధవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంపై భట్నవెల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసంలో సోమవారం అమలాపురం పట్టణ, రూరల్ మండలాల పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని అన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి పట్టణ, మండల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నల్లవంతెన వద్ద వంటెద్దు క్లాంపెక్స్ వద్ద నిరసన తెలిపి అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షుడు సంసాని నాని, గుత్తుల చిరంజీవిరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి హరి, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి బాస్కెట్‌బాల్ క్రీడా శిక్షణ


పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్న బాస్కెట్ బాల్ క్రీడాకారులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలల విద్యార్థులకు నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. విశ్రాంత ఐపీఎస్ అధికారి దివంగత కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే, మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు మెమోరియల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ శిక్షణ తరగతులు కొనసాగాయని నిర్వాహకులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. 25 ఏళ్లగా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వేలాది మంది విద్యార్థులను బాస్కెట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దామని ఎమ్మెల్సీ చెప్పారు. ఈ శిక్షణ తరగతులకు రోజూ దాదాపు 200 మంది హాజరై శిక్షణ పొందారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. ఎమ్మెల్సీతో పాటు అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తదితర పట్టణ ప్రముఖులు క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంసాని గంగాధర్, జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు నడింపల్లి అప్పలరాజు, కోచ్‌లు ఆకుల ఉమామహేశ్వరరావు, కుడుపూడి బుజ్జి తదితరులు పర్యవేక్షణలో శిక్షణ తరగుతులు జరిగాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు కుడుపూడి త్రినాథ్, వెటరన్ క్రీడాకారిణి మెహబూబ్ షకీలా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, చప్పిడి శోభన్‌బాబు, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి


ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన మల్లాడి

యానాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్స్, ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు, దాతలు సహకరించాలని కోరారు. పాఠశాల్లో స్టేట్ సిలబస్ స్థానంలో ప్రస్తుతం సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు, తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటుచేసి ప్రవేశ ఉత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రత్నప్రభ, ఫిజికల్ డైరెక్టర్ పాలికి ప్రకాష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకం బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది వ్యవసాయ కార్మికులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 7 వారాల నుంచి ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ప్రభుత్వం వేతనం చెల్లించలేదని అన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పశ్చిమాల శివ జి దైవాణి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మల్లాడి

యానాం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 21 రోజులుగా స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 110 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో క్రీడాకారుల కోసం దాదాపు అన్ని ప్రాంతాల్లో క్రీడామైదానాలతో పాటు స్టేడియంలు అందుబాటులో ఉన్నాయని వివిధ క్రీడల్లో శిక్షణకు సాయ్ అకాడమీ సైతం ఉందని వాటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. అనంతరం సీఏపీ స్కోరర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన కొట్నాల పూర్ణజయచంద్ర తదితరులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జె.చంద్రశేఖర్, పంతగడ సుమన్, పీఈటీలు పాల్గొన్నారు

నేటి నుంచి అయ్యప్ప ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు


కాపులపాలెంలో పునఃనిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం

తాళ్లరేవు: మండల పరిధిలోని కాపులపాలెంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ చెంతన పునఃనిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలమూరు మండలం పెనికేరు వాస్తవ్యులు, సువర్ణ గండపెండేర సన్మాన గ్రహీత వేద పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ తదితర ఆగమ పండితుల ఆధ్వర్యంలో శైవాగమ శాస్త్ర ప్రకారం మూడు రోజులపాటు ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 5వ తేదీ ఉదయం 7.53 గంటలకు అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. వినాయకస్వామి విగ్రహ, శిఖర, కుమారస్వామి విగ్రహ, శిఖర, మాళికాపురత్తమ్మ విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, బలి పీఠం, ద్వార పాలకులు, ధ్వజ స్తంభం, 18 మెట్ల ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

పూడికతీత పనులు పూర్తి చేయాలి

అమలాపురం రూరల్: గోదావరి డెల్టాలో కాలువలు మూసివేత సమయంలో చేపట్టిన లాకుల షట్టర్ మరమ్మతులు పూడికతీత పనులను 10 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ జల వనరులు డ్రైనేజీ విభాగపు ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జల వనరులు, డ్రెయినేజీ విభాగపు ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి మరమ్మత్తు పనులు, గుర్రపు డెక్క పూడికతీత పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి శ్రీనివాస రావు, డ్రైనేజీ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవీవీ కిషోర్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక గండు వీధిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల (ప్రస్తుతం వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల)లో పదో తరగతి చదివిన 1988-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో సోమవారం కలుసుకుని సందడి చేశారు. చదువులు నేర్పిన గురువులు కృష్ణమూర్తి, పాండురంగారావు,ఎంఎల్ఎన్ గంగాధరరావు, సావిత్రి, ఉమాదేవి, సత్యనారాయణ, భాస్కరాచార్యులు, కామేశ్వరరావుకు పూర్వ విద్యార్థులు పాద పూజ చేసి వారిని ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా సమ్మేళనానికి హాజరై సందడి చేశారు. పూర్వ విద్యార్థులు సుగ్గు కమల, యేడిద శ్రీను, నూకల శివ, నంద్యాల నాయుడు, మద్దూరి రాంబాబు, గోకరకొండ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సహజ యోగ సాధనతో ఆరోగ్యం


అమలాపురం చేరుకున్న మాతాజీ నిర్మలాదేవి సహజ యోగా ధ్యాన సాధన చైతన్య రథం


యోగాసనాలు వేసిన ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగ సాధన చైతన్య రథం సోమవారం సాయంత్రానికి అమలాపురం చేరుకుంది. అమలాపురానికి చెందిన తాడి నరసింహరావు దంపతుల ఆధ్వర్యంలో యోగా సాధకులు రథానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చైతన్య రథ యాత్ర అమలాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో సాగింది. సహజ యోగ ప్రచారకులు ఏఎస్‌వీ పట్టాభిరామం, వై.రవికుమార్ చక్రపాణి ప్రజలకు సహజ యోగ సాధనతో ఆరోగ్యం, ఆనందం పొందవచ్చని ప్రచారం చేశారు. స్థానిక సహజ యోగ ధ్యాన్య సాధన కో ఆర్డినేటర్ ఎ.లక్ష్మి, సీనియర్ సాధకులు ఐ.విజయకుమార్, ఎం.నాగేశ్వరరావు, ఆర్.సోము, శ్రీనివాసరావు, శంకర్, రమణ తదితరులు ఉన్నారు.

నిరంతర యోగా సాధనతో ఆరోగ్యం

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం ఉదయం అమలాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నిరంతర యోగా శిక్షణతో పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఆయన అన్నారు. గురువులు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బి.రాణి సంయుక్తతో పాటు వివిధ మున్సిపల్ విభాగాల అధికారులు, సిబ్బంది యోగాసానాలు వేశారు. అనంతర ఎమ్మెల్యే ఆనందరావు నిర్మాణ దశలో ఉన్న ఈదరపల్లి వంతెన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

యోగాపై ఇంటర్ విద్యార్థులకు శిక్షణ

అమలాపురం టౌన్: జిల్లాలో సోమవారం నుంచి పునః ప్రారంభమైన ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసానాలపై శిక్షణనిచ్చినట్లు డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు నిర్వహించిన యోగా శిక్షణా తరగతులను డీఐఈవో పరిశీలించారు.

ఉత్సాహంగా రంగోలీ పోటీలు

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో రంగోలీ పోటీలను అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సోమవారం నిర్వహించారు. రంగోలి పోటీల్లో పలువురు యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని యోగా ప్రాధాన్యతను ప్రతిబింబించేలా రంగవల్లులు వేసారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను జాయింట్ కలెక్టర్ అమలాపురం కలెక్టరేట్‌లో అందజేశారు. సుమారుగా 235 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, సీపీవోలను జాయింట్ కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.రాజకుమారిరాజకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేవు అంతర్వేది బీచ్‌లో 3వేల మందితో యోగా శిబిరం

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సఖినేటిపల్లి మండలం అంతర్వేది బీచ్‌లో యోగా శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 3వేల మంది పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యం

అమలాపురం టౌన్: క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ఆ వ్యాధిని నిర్మూలించడం సులభమవుతుందని వాకర్ ప్రతినిధి, ఐఎంఏ కోనసీమ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొలకోటి రంగారావు అన్నారు. వాకర్స్‌కు సోమవారం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో నిర్వహించిన అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, ఆరోగ్య సదస్సును నిర్వహించిన డాక్టర్ రంగారావును వాకర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ ఆరోగ్య సదస్సులో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర వాకర్స్ నిరంతరం పాటించాల్సిన నియామవళిపై సూచనలు ఇచ్చారు. యోగాపై వాకర్ ప్రతినిధి డాక్టర్ సీహెచ్. విష్ణుమూర్తి, వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎం ద్వారా నూతన ఒరవడిలో బోధన

అల్లవరం: ఫౌండేషన్ లిటరసీ న్యుమరసీ (ఎఫ్‌ఎల్ఏ) విద్యాబోధనలో నూతన ఒరవడి సృష్టించాలని, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ పిలుపునిచ్చారు. మండలంలోని ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆరు రోజుల ఎఫ్ఎల్ఎన్‌డీఆర్పీల శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. శిక్షణా శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీసీ మమ్మీ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్‌రెండవ దశ డీఆర్పీల శిక్షణను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. సమావేశంలో ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన 168 మంది డీఆర్పీలకు 21 మంది కేఆర్పీలు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సత్రబ్రహ్మణ్యం, ఎంఈవో వెంకన్నబాబు తదితరులు మాట్లాడారు. అనంతరం డీఆర్పీలకు గణితం కిట్లను అందజేశారు.